క్లుప్తంగా

ప్రశాంతంగా పోలింగ్

రాజానగరం: రాజమహేంద్రవరంలోని ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన పాలక వర్గానికి సంబంధించి దివాన్ చెరువు బ్రాంచ్ పరిధిలో శనివారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ బ్యాంకు పరిధిలో 2,665 మంది ఓటర్లు ఉండగా 1,625 మంది (61 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సంపర వేంకటేశ్వరస్వామి

పెదపూడి: మండలంలోని సంపర గ్రామంలో నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న ప్రాచీన వేంకటేశ్వ స్వామి ఆలయంలో ఆషాఢ మాసం చతుర్దశి శనివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్ల అందజేత

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో పారిశుధ్య కార్మికులకు అనపర్తి, మండపేట నియోజకవర్గాల వెలమ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కర్రి శ్రీనివాసరావు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్న ఉద్దేశంతో వారికి రెయిన్ కోట్లు, మాస్క్, హెడ్‌గార్డులు ఇచ్చానన్నారు.

ముంపుబారిన శ్రీరంగపట్నం


శ్రీరంగపట్నంలో రోడ్డుపైకి చేరిన నీరు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం ముంపు బారిన పడింది. గ్రామానికి ఆనుకున్న ఉన్న బురద కాలువకు శనివారం నీటి ఉధృతి పెరిగింది. దీంతో గ్రామంలోకి నీరు ప్రవేశించింది. రాత్రికి మరింత పెరిగే అవకాశం ఉండడంతో లోతట్టు ప్రాంతాల వాసులు భయాందోళనకు గురవుతున్నారు. సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి లోతట్టు ప్రాంతాలలో పర్యటించారు. వరద బాధితులకు హైస్కూల్ భవనంలో పునరావాసం ఏర్పాటు చేశారు. కాగా.. గంగవరం మండలం సూరంపాలెం ప్రాజెక్టు నుంచి అదనపు నీటిని విడిచిపెడితే బురద కాలువకు మరింత నీటి ఉధృతి పెరుగుతుంది.

గురు పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో ఊలపల్లి రోడ్డు వద్ద ఉన్న కోదండరామ సాయినాథుడి సన్నిధిలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం పంచామృత అభిషేకం, బాబా గ్రామోత్సవం, సంధ్యా హారతి, అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు.

నేడు గురుపూర్ణిమ

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపూర్ణిమ వేడుక జరుగనుంది. తెల్లవారుజామున 5.45 గంటలకు బాబా మూల విరాట్‌కు క్షీరాభిషేకం నిర్వహిస్తారు. భక్తులే స్వయంగా క్షీరాభిషేకం చేయవచ్చని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఉదయం 6 గంటల నుంచి స్థానిక సాయి భక్త మండలి ఆధ్వర్యంలో గురుచరిత్ర పారాయణ జరుగుతుందన్నారు. మధ్యాహ్న హారతి అనంతరం అన్నసమారాధన జరుపుతారు.


రాపాక వద్ద ముంపులో ఉన్న పంట పొలాలు


రాపాక - కోటికేశవరం రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న నీరు


పందలపాకలో నీట మునిగిన వరి చేలు


కరకుదురులో ముంపులో ఉన్న వరి పంట

వాన జోరు.. పొలాల్లోనే నీరు

- శాంతించని వరుణుడు
- ముంపు బారిన పంట పొలాలు

సీతానగరం: విడవకుండా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలలోని పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. పలుచోట్ల రోడ్లపైకి నీరు చేరడంతో రాకపోకలకు అవస్థలు ఎదురవుతున్నాయి. సీతానగరం మండలంలో 2,433 హెక్టార్లలో వరిపంట ముంపునకు గురైంది. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, చినకొండేపూడి, రాపాక, నల్గొండ, కూనవరం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంక, జాలిమూడి, మిర్తిపాడు, ఉండేశ్వరపురాలలో పంట ముంపులో ఉంది. వరి పంటకు నష్టం కలిగితే వరిఆకు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు బంద్

చినకొండేపూడి - చీపురపల్లి రోడ్డులోని అప్పన్నబాబు చావిడి వద్ద లోకల్వర్టుపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కోరుకొండ మండలం కోటికేశవరం - -రాపాక రోడ్డుపై నుంచి వర్షం నీరు ప్రవహిస్తోంది.

పిలక దశలో వరిపంట

ముంపులో ఉన్న వరి పంట పిలక దశలో ఉంది. ఇదే పరిస్థితి నాలుగు రోజులు కొనసాగితే కుళ్లిపోయే అవకాశం ఉంది. వరిఆకు చివరలు నీటిపైకి ఉంటే ఎటువంటి నష్టం వాటిల్లదు. వ్యవసాయాధికారి కె.సూర్య రమేష్ మాట్లాడుతూ నీరు లాగిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేయాలన్నారు. అలాగే పావు కిలో కార్బన్‌డిజమ్‌ను పిచికారీ చేయాలని సూచించారు.

కూలిన ఇళ్లు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి సీతానగరం మండలంలో మూడు తాటాకిళ్లు కూలిపోయాయని శనివారం తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు తెలిపారు. చినకొండేపూడికి చెందిన పోశిరత్నం, మిర్తిపాడుకు చెందిన డొక్క వెంకయ్యమ్మ, కాటవరానికి చెందిన సనమండ్ర ఏసుకు చెందిన ఇళ్లు కూలిపోయాయన్నారు.


కొంకుదురులో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


వెంకటాపురంలో ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరావు

80 ఎకరాల్లో నీట మునిగిన వరి

రంగంపేట: అధిక వర్షాల కారణంగా రంగంపేట మండలంలోని 80 ఎకరాలలో వరి పంట ముంపు బారిన పడిందని మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శనివారం మండలంలోని పలు గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్‌లో 2,550 హెక్టార్లలో వరి సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 1,248 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయన్నారు. అధిక వర్షాల కారణంగా వెంకటాపురం, దొడ్డిగుంట గ్రామాల్లో సుమారు 80 ఎకరాల్లో ముంపునకు గురైనట్టు గుర్తించామన్నారు. ముంపునకు గురైన వరి పొలాల నుంచి నీరు వీలైనంత తొందరగా బయటకు పోయేలా రైతులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అనంతరం ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ బూస్టర్ డోసుగా వేయాలన్నారు. తెగుళ్ల బారిన పడకుండా లీటరు నీటిలో ఒక గ్రాము కార్బండిజం, లేదా 3 గ్రాముల మాంకోజెబ్ కలిపిన మిశ్రమాన్ని పిచికారీ చేయాలని సూచించారు.

బిక్కవోలు మండలంలో 1900 ఎకరాలు

బిక్కవోలు: ఆగకుండా కురుస్తున్న వర్షంతో రైతులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలకు బిక్కవోలు, బలభద్రపురం, పందలపాక, ఊలపల్లి, కొంకుదురు, ఆరికరేవుల, మెళ్లూరు గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. అయితే వర్షాలు ఇక్కడితో ఆగిపోతే నారుమళ్లు, నాట్లు వేసిన వరిచేలను కాపాడుకోవచ్చని రైతులు ఆశపడుతున్నారు. మండల వ్యాప్తంగా 1900 ఎకరాలు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పరిశీలన

కొంకుదురు, ఆరికరేవుల, మెళ్లూరు ఆయకట్టులో ముంపు బారిన పడిన పొలాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. వర్షాల వల్ల రైతులు పంట నష్ట పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. కొంకుదురు మాజీ సర్పంచి కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, ఆరికరేవుల మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రెడ్డి శ్రీను, తహసీల్దార్ కన్యాకుమారి, ఎంపీడీవో విజయలక్ష్మి, వ్యవసాయ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

పెదపూడి మండలంలో 650 ఎకరాలు

పెదపూడి: మండలంలో 650 ఎకరాల్లో వరి నాట్లు ముంపునకు గురయ్యాయని మండల వ్యవసాయశాఖాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. ఆయన శనివారం దోమాడ, కరకుదురు, సంపర గ్రామాలలో పొలాలను పరిశీలించారు. పైప్రాంతాల నుంచి వరద నీరు రావడంతో మండలంలోని వరి పొలాలు నీటి మునిగాయన్నారు. ముంపు నేపథ్యంలో రైతులు ఆందోళన చెందవద్దని, గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు, సహాయకుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. అలాగే సంపర, కరకుదురు, ఏపీ త్రయం గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. మండలంలో పంట, మురుగు కాలువలను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


వాసంశెట్టి మాధవను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ఇటీవల మరణించిన కరకుదురు మాజీ సర్పంచ్ జుత్తక నాగభూషణం కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం కరకుదురులో పరామర్శించారు. నాగభూషణం మృతికి గల కారణాలను అతడి అల్లుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి వాసంశెట్టి మాధవను అడిగి తెలుసుకున్నారు. నాగభూషణం సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఇటీవల గ్రామంలో మృతి చెందిన చిక్కాల సుబ్బారావు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ వుండ్రు చంద్రకళ, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, పెమ్మనబోయిన గోవిందరాజు, సీహెచ్ బాబు, వల్లూరి పట్టాభిచౌదరి, పాటంశెట్టి త్రిమూర్తులు, యెండ్రు సుబ్బారావు, ముప్పిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలోనే ములకల్లంక

- కొనసాగుతున్న వరద ఉధృతి
- మర పడవలపై రాకపోకలు
- బోట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు


బొబ్బిల్లంక - ములకల్లంక మధ్య మర పడవపై ప్రయాణిస్తున్న ప్రజలు

సీతానగరం: గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో ములకల్లంక గ్రామం జలదిగ్బంధం నుంచి బయటపడలేదు. నది మధ్యలో ఉన్న ఈ గ్రామానికి వెళ్లే రోడ్డు ముంపు బారిన పడడంతో ప్రజలు మరపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వరద చాలా ఎక్కువగా ఉన్న కారణంగా మర పడవలపై ప్రయాణం సురక్షితం కాదు. ఈ నేపథ్యంలో బొబ్బిల్లంక - ములకల్లంక గ్రామాల మధ్య రాకపోకలకు బోట్లు, లాంచీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమయంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గోదావరి వరద వచ్చిన వెంటనే బోట్లను ఏర్పాటు చేసేవారు. వాటిపై ప్రజలు సురక్షితంగా ప్రయాణం సాగించేవారు. అయితే ఇప్పుడు వరద వచ్చి నాలుగు రోజులవుతున్నా బోట్లను ఏర్పాటు చేయలేదు.

నిరంతర పర్యవేక్షణ

మలకల్లంకలోని పరిస్థితిని నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్ సాయిబాబా ఎప్పటి ఎప్పుడు తెలుసుకుంటున్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు, ఈవోపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి రజాక్, వీఆర్వో నాగమణి, వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీ ఆధ్వర్యంలో ములకల్లంకలో పారిశుధ్య కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామంలోని అన్నిచోట్ల బ్లీచింగ్ చల్లుతున్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రెండేళ్ల క్రితం ఆ గ్రామంలో టవర్లు ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగలేదు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కుక్కకాటు, పాము కాటు వ్యాక్సిన్లు, మందులు సిద్ధంగా ఉంచారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. వైద్యులు ఏవీకే చైతన్య, ఎస్.రాజు, మేఘన, ఏసురాణి పర్యవేక్షిస్తున్నారు. గోదావరి వరద బాగా పెరిగితే ములకల్లంక వాసులకు బొబ్బిల్లంకలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

ప్రగతి సాధనకు సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

మధురపూడి: నియోజకవర్గ ప్రగతి కోసం రాజకీయాలకు అతీతంగా సమష్టిగా పనిచేద్దామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష జరిగింది. ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ అధికారులు ప్రజలకు సేవలందించేలా ఉండాలన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీలు పలు సమస్యలు తెలియజేశారు. జగన్నాథపురం సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా రాంబాబు మాట్లాడుతూ పుష్కర నీరు గ్రామంలో శివారు ప్రాంతాన్ని ముంచెత్తుతోందని, కచ్చా కాలువల్లో సిల్ట్‌ను తొలగిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి, వైస్ ఎంపీపీ బొరుసు నాగమణి, ఎంపీటీసీ, సర్పంచులు సత్కరించారు. సమావేశంలో నియోజకవర్గం ప్రత్యేక అధికారి సాయిబాబు, ఎంపీడీఓ హేమసుందరరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎస్సై డి.ఆనంద కుమార్, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


నల్లమిల్లిలో కూరదోస పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి దివ్యశ్రీ

రంగంపేట: అధిక వర్షాల కారణంగా కూరగాయల పంటల్లో తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యాన శాఖ అధికారి కె.దివ్యశ్రీ సూచించారు. శనివారం మండలంలోని గ్రామాల్లో ఉద్యాన పంటలను ఆమె ఉద్యాన, వ్యవసాయ సహాయకులతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో వంగ, బెండ, చిక్కుడు, మిరప, కాకర, ఆగాకర, బీర, ఆనబ తదితర రకాల కూరగాయలు 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారన్నారు. అధిక వర్షాల కారణంగా కూరగాయల పంటలకు తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున రైతులకు నివారణ చర్యలు సూచించామన్నారు. వర్షాలు ఆగిన అనంతరం పొలంలో నీరు లేకుండా చేసి వెంటనే కలుపు తీయాలని, ఎండు తెగులు రాకుండా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. ఆకుమచ్చ, బూజు తెగులు నివారణకు కార్బెండిజం 1 గ్రాము లేదా, మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆయిల్ పామ్ లేత తోటల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే మొవ్వ కుళ్లు ఆశించే అవకాశం ఉంటుందన్నారు. దాని నివారణకు కార్బెండిజం 1 గ్రాము లీటరు నీటిలో కలిపి మందు ద్రావణంతో మొవ్వ భాగం తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి ఆర్.అరవింద్ సాయి, గ్రామ ఉద్యాన వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జాగ్రత్త అవసరం

- నిల్వ ఆహారంతో అనేక అనర్థాలు
- ఇటీవల సీతానగరంలో పలువురికి అస్వస్థత
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్య సిబ్బంది

సీతానగరం: నిల్వ, కల్తీ ఆహారంతో అనేక అనర్థాలు కలుగుతున్నాయి. వీటిని తీసుకోవద్దని వైద్య సిబ్బంది ఎంతగా చెబుతున్నా కొందరు వినడం లేదు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు చర్యలు తీసుకుంటున్నా, ప్రజలకు అవగాహన కలగడం లేదు. ఈనెల 3న సీతానగరంలో డయేరియా లక్షణాలతో 16 మంది అనారోగ్యం పాలయ్యారు. వారిలో ఇద్దరు మృతి చెందారు. వీరికి వాంతులు, విరోచనాలు కావడానికి నిల్వ చేపలు తినడమే కారణమని తెలుస్తోంది.

పారిశుధ్య చర్యలు

డయేరియా లక్షణాలతో పలువురు ఆస్పత్రిలో చేరడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వెంటనే తగిన చర్యలు ప్రారంభించింది. పంచాయతీ అధికారులు అప్రమత్తమై డ్రైనేజీలో చెత్త చెదారం తొలగించి, రోడ్డులను శుభ్రపర్చారు. పంచాయతీ వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచారు. డీపీవో, పీఎల్‌పీవో, డీఎంహెచ్‌వోలు సీతానగరంలో పర్యటించారు. ప్రజలకు వాటర్ ట్యాంకర్ నుంచి తాగునీటిని సరఫరా చేశారు. అలాగే ఈ నెల 5న కలెక్టర్ పి.ప్రశాంతి సీతానరగంలో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. పరిస్థితి అధ్వానంగా ఉందంటూ ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. మాంసం, చేపలు దుకాణాలతో పాటుగా హోటళ్లు, స్వీట్‌స్టాళ్లు, టీ దుకాణాలను మూయించారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణలో నాలుగు బృందాలు ఇంటింటి సర్వే నిర్వహించాయి.



సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


సీతానగరంలో డ్రైనేజీని శుభ్రం చేస్తున్న సిబ్బంది (ఫైల్)

నిల్వ చేపలే కారణమా..

ఆటోపై చేపలను తీసుకువచ్చి కిలో రూ.50 చొప్పున గ్రామంలో విక్రయించారు. వాటిని కొనుగోలు చేసి వండుకు తిన్నవారితో పాటు, కర్రీ పాయింట్ వద్ద కూరలు తిన్నవారికి ఆ రోజు ఫుడ్ పాయిజన్ అయ్యింది. దీంతో వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరారు. ఆటోపై తీసుకువచ్చిన చేపలను తినడం వల్లే అనారోగ్యం వచ్చిందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. డయేరియా లక్షణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 14 మంది ఇళ్లకు చేరుకున్నారు. ఈనెల 10 న కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బేదంపూడి జగన్నాథం, 14న ఇంటి వద్ద చికిత్స పొందుతూ పెంటా సుబ్బారావు మృతి చెందారు. వీరు డయేరియా లక్షణాల నుంచి బయటపడినా, మూత్రపిండాలు పని చేయకపోవడంతో పాటు పలు ఆరోగ్య సమస్యలతో మరణించారని వైద్యులు నిర్ధారణ చేశారు. కొందరు ఆసుపత్రిలో చేరకుండా ఇంటి వద్దే ఆర్‌ఎంపీలతో చికిత్స తీసుకున్నారు.

జాగ్రత్త అవసరం

ఇది సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం. దానికి తోడు వర్షాలు విపరీతంగా కురుస్తున్నాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో అనేక రోగాలు ప్రబలే అవకాశం ఉంది. ఆగకుండా కురుస్తున్న వర్షాలతో ఆ సమస్య మరింత ఎక్కువగా మారుతుంది. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని, నిల్వ పదార్థాలు, మాంసాహారానికి దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

చేపల వల్లే ఫుడ్ పాయిజన్



ఆటోలో అమ్మకానికి వచ్చిన చేపలను కొనుగోలు చేసిన వారికి, కర్రీ పాయింట్ వద్ద కూరలు తిన్న వారికి ఫుడ్ పాయిజన్ అయింది. పంచాయతీ సరఫరా చేసే నీటిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు టెస్టింగ్ పంపితే రిపోర్టులో అంతా బాగుందని వచ్చింది. గ్రామంలో పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరిచాం. తాగునీటిని క్లోరినైజేషన్ చేసి, వీధుల్లో బ్లీచింగ్ చల్లించాం.

– కోండ్రపు ముత్యాలు, సర్పంచ్, సీతానగరం

అప్రమత్తంగా ఉండాలి



వాంతులు, విరేచనాలతో ఎక్కువ మంది బాధపడితే సాధారణంగా డయేరియాగా పరిగణించి చికిత్స అందిస్తాం. ప్రజలు వేడిగా పదార్థాలను తీసుకోవాలి. చేపలు, మాంసాహారం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. ఇంటిలో వండిన ఆహారం తీసుకోవడం చాలా ఉత్తమం. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ ఏఈకే చైతన్య, సీహెచ్‌సీ వైద్యులు, సీతానగరం